క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



సహదేవ్‌ను సన్మానించిన మాజీ మంత్రి సూర్యారావు

మలికిపురం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అంతర్వేదిపాలెంకు చెందిన హ్యూమానిటీ హార్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తాడి సహదేవ్‌కు ఇటీవల జాతీయస్థాయి సేవారత్న అవార్డు లభించింది. ఈ సందర్భంగా మంగళవారం మలికిపురం పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సమదేవ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. సూర్యారా వు మాట్లాడుతూ సహదేవ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గొల్లమందల చిట్టిబాబు, కుసుమ చంద్రశేఖర్, రుద్రరాజు రంగరాజు, నల్లి ప్రేమనాదం,బళ్ళ నోబెల్,ఆరిపెల్లి సత్యనారాయణ,రుద్రరాజు రామరాజు,కమిడీ లత, ముప్పిరి బాబీ,గొల్లమందల కిన్ను అభినందించారు.

పశువులకు వైద్యసేవలు

మలికిపురం: రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా జిల్లా పశుగణాభివద్ధి సంస్థ సౌజన్యంతో మంగళవారం రామరాజులంక బాడవలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ మలికిపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ శివకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూ.20వేల విలువైన చూడు కట్టడానికి, ఎదకు రావడానికి అవసరమైన ఖనిజ లవణాల మిశ్రమం, నట్టల నివారణ, జలగ నివారణ, బలవర్ధకమైన లివర్ టానిక్కులను రైతులకు అందజేశారుజ సుమారు 34 మంది రైతులకు సంబధించిన 91 పశువులకు సేవలందించారు. పశు వైద్యులు డాక్టర్ పి.సూర్యనారాయణ రాజు, డా. కే సునీల్ గాంధీ, డాక్టర్ స్వప్నిక, రవి, ప్రేమ్, శ్రీమన్నారాయణ, ప్రసద్, శేషు, విజయ్, సుమంత్, సుప్రియ, రైతులు మేడిచర్ల, వెంకటేశ్వరరావు, నరసింహమూర్తి, మాచినేడి భూషణం రమేష్, రంగారావు, యోహన్, సుందర్‌రావు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ఘర్షణలను తక్షణం నివారించాలి

సఖినేటిపల్లి: కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మణిపూర్‌లో ఘర్షణలను నివారించి, శాంతిని నెలకొల్పాలని సీపీఐ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న మారణకాండకు, విద్యుత్ ఒప్పందాలలో అక్రమాలకు నిరసనగా మంగళవారం వారు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, మణిరపూర్‌లో ప్రత్యేక సాయుధ చట్టం ద్వారా క్రైస్తవులపై వివక్షత చూపించడం తగదని అన్నారు. అలాగే విద్యుత్ ఒప్పందాలలో అక్రమాలకు పాల్పడిన వారిపై కేంద్రం కఠినంగా వ్యవహరించాలన్నారు. అనంతరం తహసీల్దారు, విద్యుత్ కార్యాలయాల్లో నాయకులు వినతిపత్రాలను అందజేశారు. గెడ్డం ప్రభాకర్‌రావు, నల్లి బుజ్జిబాబు, చెల్లుబోయిన తాతారావు, సరెళ్ల శివ, చొప్పల బెన్ని తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 విరాళం



దాత ఆదుర్తి శివాజీ వెంకటరమణ దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మలికిపురం మండలం లక్కవరం గ్రామస్తులు ఆదుర్తి శివాజీ వెంకటరమణ దంపతులు మంగళవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పీఎంఎంఎస్ఏతో మాతృ, శిశు మరణాల నివారణ



చొప్పెల్లలో వైద్య పరీక్షలు చేస్తున్న మల్లికార్జున్

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిషోర్ అన్నారు. పీఎంఎంఎస్ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన పీఎంఎంఎస్ఏలో సుమారు 147 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే లాబ్ టెక్నీషియన్లు నేతృత్వంలో రక్త పరీక్షలు నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవివి,రాజా, బి.సూర్యనారాయణ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

విద్యుద్దీపాలతో జర భద్రం!

- అప్రమత్తంగా ఉండాలి
- ఆదమరిస్తే ప్రమాదమే
- పనుల సమయంలో విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరి



క్రిస్మస్ సందర్భంగా ఓ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

మలికిపురం: పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండగలు, ఇతర ముఖ్యమైన రోజుల్లో ఇంటిని విద్యుద్దీపాలలో అందగా అలంకరించుకోవడం మన సంప్రదాయం. ఆ వెలుగులతో కళకళలాడుతున్న ఇంటిని చూస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది. ప్రస్తుతం డిసెంబర్ నెల నడుస్తోంది. ఈ మాసమంతా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయి. వచ్చే నెల సంక్రాంతి సందర్భంగా జరిగే సందడి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ సమయంలో చర్చిలు, దేవాలయాలు, ఇళ్లకు విద్యుద్దీపాలతో అలంకరణ చేస్తారు. అయితే వీటిని ఏర్పాటు చేసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

నిర్లక్ష్యం వద్దు

రాజోలు దీవిలో ఈ పండగలు అత్యంత కీలకం. ఈ సందర్భంగా విద్యుద్దీపాల అలంకరణ కీలకంగా ఉంటుంది. దీంతో విద్యుత్ శాఖకు కత్తిమీద సాములా మారింది. రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాలలోని ప్రధాన విద్యుత్ లైన్లతో పాటు, గృహ వినియోగ సర్వీస్ లైన్లు కూడా నివాస ప్రాంతాలు, కొబ్బరి, ఇతర భారీ వృక్షాల వెంబడే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి నెలా విద్యుత్ శాఖ అధికారులు చెట్ల తొలగింపు చర్యలను చేపడుతున్నారు.

ప్రమాదాలు

పండగలు, ఉత్సవాల వేళ కొందరు సొంతంగా లైటింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ దేవాలయాలతో పాటు చర్చిలు కూడా అధికంగా ఉన్నాయి. ఇందులో ప్రధానంగా యువత, లైటింగ్ సిబ్బంది కూడా చర్చిల వద్ద, ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేసే సమయాలలో ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. అలాగే తీర్థ మహోత్సవాల సమయంలో కూడా లైటింగ్ సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో ఉండడంతో కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. గడిచిన పదేళ్ల కాలంగా పలువురు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి.

జాగ్రత్తలు ఇలా..

- విద్యుత్ వినియోగ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యుత్ శాఖ అవగాహన కల్పిస్తుంది. ప్రధానంగా మైకు సెట్లు, మండపాల లైటింగ్ సిబ్బంది కూడా నాణ్యమైన పరికరాలు వినియోగించాలి. నాణ్యమైన వైర్లు, కేబుళ్ల జంక్షన్ బాక్సులు, పవర్ కార్డులు వాడాలి. ఎటువంటి లూజు కాంటాక్టులు లేకుండా చూసుకోవాలి.
- జాయింట్ల వద్ద ఇన్సులేషన్ టేపులను సక్రమంగా చుట్టాలి. సూది పిన్నులు జాయింట్లను కలిపేందుకు వాడకూడదు. చేంజ్ ఓవర్ స్విచ్‌లు, జనరేటర్ల వద్ద కేబుళ్ల జాయింట్లు లేకుండా చూసుకోవాలి. అలాగే లోడ్‌కు సరిపడే కేబుళ్లు వాడాలి.
- కార్యక్రమాలకు నేరుగా మెయిన్ స్విచ్ నుంచి కాకుండా ఎంసీబీ లేదా ఫ్యూజ్ ద్వారా కంట్రోల్‌లో ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. ఆంప్లిఫైర్లు, మైకులు, సౌండ్ బాక్సులు జన సమర్థ ప్రదేశాలలో కాకుండా పక్కగా ఉండేటట్లు చూసుకోవాలి.
- రబ్బర్ మాట్లు చక్కబల్లలు వాడుకోవాలి.



విద్యుత్ లైన్లలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

విద్యుత్ వినియోగ ప్రాంతాలలో తడి లేకుండా చూసుకోవాలి. ఫంక్షన్లు, ఉత్సవాలకు నేరుగా పోల్స్ మీద నుంచి విద్యుత్ తీసుకోకూడదు.

- లైను పనులు చేసే కార్మికులు పనిచేసే చోట తప్పని సరిగా స్పాట్ ఎర్త్ తీసుకోవాలి. పని పూర్తయి స్తంభం దిగిన తరువాత మాత్రమే ఎర్త్ తీసివేయాలి. సేఫ్టీ పరికరాలు అయిన గ్లోవ్స్, హెల్మెట్, నడుం బెల్ట్, రబ్బరు బూట్లు తప్పని సరిగా వాడాలి.
- పనిచేసేటప్పుడు హెచ్‌టీ ఎల్‌టీ లైన్లు ఎక్కడ ఉన్నదో చూసుకోవాలి. డిపార్టుమెంట్ అనుమతితో మాత్రమే ఆయా సిబ్బంది లైన్ వర్కు నిర్వహించుకోవాలి.
- నైపుణ్యం కలిగిన సిబ్బంది మాత్రమే విద్యుత్ సంబంధిత పనులు నిర్వహించాలి. సిబ్బంది అందరూ తప్పనిసరిగా ఏదైనా బీమా కలిగి ఉండాలి.

అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ ప్రమాదాలపై ప్రభుత్వ, ప్రైవేట్ సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి. అప్పుడే ప్రమాదాలను నివారించగలం. ఎక్కడ ఏ కార్యక్రమానికి విద్యుత్ వినియోగించినా మా సిబ్బంది పర్యవేక్షణ లేనిదే పనులు నిర్వహించకూడదు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. – మద్దూరి సతీష్, ఏఈ మలికిపురం

అనుమతి తప్పనిసరి



గ్రామాల్లో ఎటువంటి విద్యుత్ సంబంధిత పనులకు అయినా ప్రైవేటు, ప్రభుత్వ సిబ్బంది కూడా, తమ శాఖ అధికారులు, సిబ్బంది అనుమతి తప్పనిసరిగా తీసుకుని మాత్రమే పనులు నిర్వహించుకోవాలి. అక్రమ కనెక్షన్ల జోలికి పోవద్దు. ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు. – చేకూరి శ్రీనివాసరావు, ఏడీఈ, రాజోలు

దివ్యాంగ విద్యార్థులకు బహుమతుల పంపిణీ



ఆలమూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

ఆలమూరు: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని ఆలమూరు భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు మంగళవారం బహుమతుల పంపిణీ చేశారు. స్థానిక మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న భవిత కేంద్రంలో నిర్వహించిన ఈ సమావేశానికి మండల విద్యా శాఖాధికారులు భమిడిపాటి అప్పాజీ, ఎస్వీ సుబ్బరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని తొలుత విద్యార్థులకు నిర్వహించే వివిధ పోటీలను పర్యవేక్షించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన దివ్యాంగ విద్యార్థులకు ఉపాధ్యాయులు రామచంద్ర, జనార్దన్, నాగమణి, శ్రీనివాస్, వెంకట్రావు సమకూర్చిన బహుమతులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ దివ్యాంగు ఆత్మస్థైర్యంతో మెలగడం ద్వారా అన్ని రంగాల్లో ముందుకు వెళ్లవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులందరూ శ్రద్ధా శక్తులతో విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఏజీపీ బూసి విద్యాప్రసన్న, భవిత ఉపాధ్యాయులు జి.విజయ, ఇ.సత్య కిరణ్, సీఆర్పీలు ఎ.జ్యోతి, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులను గాలికొదిలేసిన ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' పేరుతో పోస్టర్ ఆవిష్కరణ



రావులపాలెంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: రాష్ట్రంలో గిట్టుబాటు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ ఈ నెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ×అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ× పేరుతో రూపొందించిన పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్రంలోని రైతులకు అండగా నిలిచేందుకు, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రైతులకు న్యాయం చేసేందుకు ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అతి దారుణంగా ఉందనీ ఈ ఏడాది అకాల వర్షాలు, వాయుగుండాల వల్ల రైతుల పంట దిగుబడి ఇరవై నుంచి ముప్పై బస్తాలకే పరిమితం అయ్యిందన్నారు. చివరికి ఆ ధాన్యానికి కూడా గిట్టుబాటు ధర కల్పించలేని దుర్మార్గమైన పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ రైతుల వద్దకు వెళ్లి ఇచ్చిన హామీలు నిజమని నమ్మిన రైతులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా, మెసేజ్ చేసినా పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మద్దతు ధర కన్నా ఎక్కువకే రైతులు ధాన్యం అమ్ముకున్నారని జ్ఞాపకం చేశారు. నేడు ఇన్ పుట్ సబ్సిడీ లేదు, ఈ క్రాస్ అసలే లేదు, ఈ పరిస్థితిలో రైతుకు అండగా వైఎస్సార్ సీపీ ఉందనే నమ్మకం ప్రజలకు ఉందని, ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం అని ఈ పరిస్థితులకు నిరసనగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయ వద్దకు వెళ్లి వినతిపత్రాలు సమర్పించనున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం కొత్తపేట ఎంపీపీ మార్గాన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, సర్పంచ్ తమ్మన శ్రీను, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేయాలి

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: రానున్న నీటి సంఘాల ఎన్నికల్లో ప్రతి చోటా పోటీ చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వైఎస్సార్ సీపీ శ్రేణులకు సూచించారు. మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 14న జరగనున్న నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేసి మన సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికలలో అధికార కూటమి అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. కూటమి కుయుక్తులను ఎదిరింది. రైతులకు మేలు జరిగేలా వైఎస్సార్ సీపీ నాయకులు నిలబడాలని సూచించారు. ప్రస్తుత కూటమి పాలనలో రైతులతో సహా అన్ని వర్గాలకూ అన్యాయం జరిగిందన్నారు. మొత్తం నాలుగు మండలాలకు సంబంధించిన ముఖ్య నాయకులను పరిశీలకులుగా నియమించారు. సమావేశంలో సఖినేటిపల్లి సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, కుసుమ చంద్రశేఖర్, రుద్రరాజు రంగరాజు, నల్లి ప్రేమనందం, బళ్ల నోబెల్, ఆరిపెల్లి సత్యనారాయణ, రుద్రరాజు రామరాజు, తాడి సహదేవ్, కమిడీ లత, ముప్పిరి బాబీ, గొల్లమందల కిన్ను తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికల పోటీకి సిద్ధం

సఖినేటిపల్లి: ఈ నెల 14న రానున్న నీటి పారుదల సంఘం ఎన్నికలకు సఖినేటిపల్లి మండలం నుంచి 3 నీటి సంఘాలకు వైఎస్సార్ సీపీ తరపును పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు మండల శాఖ పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం సఖినేటిపల్లి మండలం రామేశ్వరం గ్రామంలో మాజీ నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్ట ఉమామహేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షులు లచ్చిబాబు, మాజీ ఎంపీటీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్ బకాయిలు సత్వరమే చెల్లించాలి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న గ్రామ పంచాయతీలు ఇప్పటికే వసూలు చేసిన గ్రంథాలయ పన్నులను సత్వరమే జిల్లా గ్రంథాలయ శాఖకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆలమూరు గ్రంథాలయశాఖాధికారి టి.నమశ్శివాయ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పాఠకులతో కలిసి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ ఎ.రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గ్రంథాలయ సంస్థకు ఆయా పంచాయతీలు సెస్ చెల్లించడంలేదన్నారు. దీనివల్ల జిల్లా గ్రంథాలయ సంస్థలో తీవ్రమైన నిధుల కొరత ఏర్పడిందని ఆయన ఆందోళన చెందారు. జిల్లా గ్రంథాలయ సంస్థ తమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు, పత్రికల బిల్లులు చెల్లించేందుకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన చెందారు. ఆలమూరు మండలంలోని 18 గ్రామ పంచాయతీల నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ.37 లక్షల వరకూ జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ కావలసి ఉందన్నారు. ఇకనైనా జిల్లా అధికారులు సత్వరమే స్పందించి గ్రామ పంచాయతీలు సెస్ వసూళ్లు గ్రంథాలయ సంస్థకు చేరేలా చూడాలన్నారు. గొడవర్తి రామకృష్ణ చంద్ర కిరణ్, జి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టుకు ప్రత్యేక విద్యుత్ లైన్



విద్యుత్ లైన్ పనుల పరిశీలన తర్వాత మాట్లాడుతున్న ఎస్ఈ రాజబాబు, గోపాల కృష్ణంరాజు తదితరులు

మలికిపురం: రాజోలు సబ్ డివిజన్ పరిధిలోని లక్కవరం సబ్ స్టేషన్ నుంచి గుడిమెల్లంక వాటర్ ప్రాజెక్టు వరకూ ప్రత్యేక విద్యుత్ లైన్ వేస్తున్నారు. రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ కృషితో ప్రజలందరికీ తాగునీరు అందించాలని ఉద్దేశంతో నూతనంగా ప్రత్యేక 11 కేవీ లైను మంజూరు చేయించినట్టు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్ఈ ఇ.రాజబాబు లక్కవరం సబ్‌స్టేషన్‌కు మంగళవారం వచ్చి పనులను పరిశీలించారు. లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకష్ణ రాజు మర్యాదపూర్వకంగా ఎస్ఈని కలుసుకున్నారు. గ్రామంలో లో ఓల్టేజీ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కన్‌స్ట్రక్షన్ డీఈఈ విజయానంద్, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

హక్కులను పరిరక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

రాజోలు: రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. మంగళవారం కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. స్వేచ్ఛ, సమానత్వం, భావ ప్రకటన స్వేచ్ఛ హక్కులు ఉల్లంఘించకుండా పరిరక్షించుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు వై.కె.ఎస్.ఎన్.మూర్తి, పీఆర్వో నల్లి రాజు, శైలజ, అశ్విని, చంద్రబోస్ పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణా అడ్డగింపు



గోవులను అంతర్వేది దేవస్థానానికి తరలించిన సమితి సభ్యులు

మలికిపురం: అక్రమంగా దూడలను తరలిస్తుండగా హిందూ పరిరక్షణ సమితి సభ్యులు అడ్డగించారు. పోలిశెట్టి గణేష్, ఇతర సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో మలికిపురం సఖినేటిపల్లి రహదారిలో గోవులను పట్టుకుని మంగళవారం పోలీసులకి అప్పగించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఇటీవల మన ప్రాంతంలో మూగ జీవాలపై దాడులు జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటాం పోలీసులు చెప్పారని ఆయన అన్నారు. అక్రమంగా తరలిస్తున్న ఆవులను అంతర్వేది దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు తరలించారు. దేవ స్థాన ఈఓ సత్యనారాయణ ఈ విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందజేశారని గణేష్ తెలిపారు. అడబాల లోకేష్, సాగిరెడ్డి ఫణి, నిమ్మగడ్డ ఫణి, అడ్డాల వాసు, యేరుబండి చిన్ని, ఐ.నవీన్, జి.కృష్ణ, ఐ.సురేష్, రక్షించినవారిలో ఉన్నారు.

హింస లేని సమాజాన్ని నిర్మిద్దాం



ఆలమూరులో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రవికుమార్

ఆలమూరు: వివక్షకు తావులేకుండా హింసలేని సమాజాన్ని నిర్మిద్దామని, మానవ హక్కులను పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని ప్రముఖ హోమియో వైద్యులు, మానవ హక్కుల పరిరక్షణ నేత చల్లా రవికుమార్ అన్నారు. ఆలమూరులో మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. సమత స్వచ్ఛంద సంస్థ కార్యాలయం ప్రాంగణంలో చైర్మన్ జె.యేసురాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి డాక్టర్ రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎందరో మహనీయుల పోరాటాల ద్వారా సాధించుకున్న అనేకమైన హక్కులు ప్రస్తుతం రాజకీయ అనిశ్చితి కారణాల వల్ల కాల గర్భంలో కలిసిపోతున్నాయని ఆవేదన చెందారు. నేటి సమాజంలో బానిస వ్యవస్థ ఇంకా మారలేదని, వేర్వేరు రూపాల్లో ఇంకా కనబడుతుందంటూ చరిత్రలో జరిగిన కొన్ని సంఘటనలను ఉదాహరణల ద్వారా ఆయన వివరించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గ్రామ సర్పంచ్ నేలపూడి లావణ్య, ఏజీపీ బూసి విద్యా ప్రసన్న, సమత ఫౌండర్ శామ్యూల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవి కుమార్, మానవహక్కుల సంఘ ప్రతినిధులు కెవి.రామారావు, సాయిబాబు, వనుం లక్ష్మణరావు, కె.అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



పోతుకుర్రు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అయినవిల్లి తహసీల్దార్ నాగలక్ష్మమ్మ



పినపళ్లలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

అంబాజీపేట: భూ కబ్జాల నుంచి సామాన్యులకు రక్షణ, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. ఇరుసుమండలో రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించారు. అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, శాశ్వత రికార్డుల కౌంటర్‌లను తహసీల్దార్ పరిశీలించారు. సదస్సులో సర్పంచ్ అక్కిశెట్టి నాగవేణి, ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ, ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్వోలు జి.నాగేంద్ర, ఎండోమెంట్ అధికారి కామేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు: రెవెన్యూ సంబంధిత సమస్యలతోపాటు అర్హులైన లబ్ధిదారులు అందరికీ సంక్షేమ పథకాలను అందజేసేందుకు ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్టు మండల ప్రత్యేక అధికారి కె.నాగేశ్వరరావు, తహసీల్దార్ కె.జె.ప్రకాష్ బాబు అన్నారు. పినపళ్లలో సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెదిరెడ్డి పట్టాభి ఆధ్వర్యంలో స్థానిక సంగిత లక్ష్మీకాంతం కల్యాణ మండపంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, తహసీల్దార్ ప్రకాష్‌బాబు పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ టి.రామాయమ్మ, సర్వేయర్ ప్రభావతి, గ్రామ రెవెన్యూ అధికారి బుంగ ఉదయ్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు, సర్వేయర్ ఎస్‌కె. మొహిద్దిన్ పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం, పోతుకుర్రు గ్రామాల్లో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామ సర్పంచులు మేడిశెట్టి ఉషారాణి, సయ్యపరాజు సుబ్బలక్ష్మిల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారు. కె.జగన్నాథపురంలో 10, పోతుకుర్రు గ్రామంలో 8 రైతుల నుంచి అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రాజోలు: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్ అన్నారు. కూనవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 17 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు ప్రసాద్ తెలిపారు. వాటితో పాటు రైస్‌కార్డు కోసం 13, గృహనిర్మాణం కోసం 8, పింఛన్ల కోసం 27 దరఖాస్తులు వచ్చాయన్నారు.

వెలవెలబోయిన రెవెన్యూ సదస్సు



బి.దొడ్డవరం రెవెన్యూ సదస్సులో ఖాళీగా ఉన్న కుర్చీలు

మామిడికుదురు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు మొదటి రోజు మంగళవారం రైతులు లేక వెలవెలబోయింది. బి.దొడ్డవరం గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సదస్సుకు కేవలం ఎనిమిది మంది రైతులు మాత్రమే హాజరయ్యారు. సదస్సుకు వచ్చిన అధికారులు, ఉద్యోగులు మాత్రం 20 మందికి పైగా ఉన్నారు. రైతుల కన్న ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారని అక్కడకు వచ్చిన వారు చర్చించుకున్నారు. ముందుగా మండల ప్రత్యేకాధికారి, పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఎమ్మార్వో వైవీ సుబ్రహ్మణ్య ఆచార్యులు, సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ సదస్సును ప్రారంభించారు. సదస్సులో సీఎం ప్రసంగం చదివి వినిపించారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను అరికట్టవచ్చు



జి.అగ్రహారంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే సులువుగా నివారించవచ్చునని స్థానిక సీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్ బి.అప్పారావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు ప్రభాకర్ నగర్‌కాలనీలో కాన్సర్ వ్యాధిపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటిలో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానం, ఖైనీ గుట్కా, మద్యం, బహుళ అసురక్షిత లైంగిక అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధిపై మహిళలు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దుర్గాప్రసాద్, ఎంపీహెచ్ఏ జి.మురళి ప్రసాద్, ఆశా పాల్గొన్నారు.